స్పార్క్ మైండ్ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలి

బాన్సువాడ టౌన్, జనవరి 12: బాన్సువాడలోని స్పార్క్ మైండ్ పాఠశాల గుర్తింపును రద్దు చేయాలని కలెక్టరేట్, డీఈవో కార్యాలయాల్లో హిందూ వాహిని సభ్యులు ఫిర్యాదు చేశారు. పాఠశాలలో మతపరమైన బోధనలు చేస్తున్నారని వారు ఆరోపించారు. ఈ కార్యక్రమంలో హిందూవాహిని రాష్ట్ర బోధన ప్రముఖ్ లక్ష్మణ్, జిల్లా కన్వీనర్ సాయికిరణ్, జిల్లా ప్రచార ప్రముఖ సునీల్‌రావు, కామారెడ్డి టౌన్ కన్వీనర్ తరుణ్, మహేందర్, సాయిప్రసాద్, నవీన్, సిద్దార్థ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలకు పత్తిని తరలించిన దృశ్యం



పత్తి రైతు.. పరేషాన్!

- దిగుబడి లేక.. ధర రాక జిల్లా రైతుల్లో ఆందోళన
- బహిరంగ మార్కెట్‌లో క్వింటా పత్తి రూ. 6,700 మాత్రమే
- మద్దతు ధర కంటే రూ.300 తక్కువకు కొనుగోలు చేస్తున్న దళారులు
- నాణ్యత లేదన్న సాకుతో ధరల్లో వ్యాపారుల కోత
- ఈ సీజన్‌లో ఇప్పటి వరకు దక్కని ధర
- కోతలతో సీసీఐలో అమ్మకాలకు రైతుల విముఖత
- పెట్టుబడులు రావడం కష్టమేనంటున్న రైతులు



కామారెడ్డి, జనవరి 12(ఆంధ్రజ్యోతి): పత్తి ధరలు రోజురోజుకూ పడిపోతుండడంతో రైతులు పరేషాన్ అవుతున్నారు. సంక్రాంతి పండుగకు ముందైన ధర పెరుగకపోదా అని ఆశగా ఎదురుచూస్తున్న రైతులకు నిరుత్సాహమే ఎదురవుతోంది. ధర పెరిగే పరిస్థితి లేకపోవడంతో రైతులు తమ ఇళ్లలో నిల్వ చేసిన పత్తిని మార్కెట్‌కు తీసుకువచ్చి విక్రయిస్తున్నారు. ఈ క్రమంలో వ్యాపారులు చెబుతున్న ధరను చూసి రైతులు నిరుత్సాహానికి గురవుతున్నారు. మార్కెట్‌కు తెచ్చిన పత్తిని తిరిగి ఇంటికి తీసుకెళ్లలేక వ్యాపారులు చెప్పిన ధరకు విక్రయించాల్సిన పరిస్థితి ఎదురవుతోంది. మద్నూర్ మార్కెట్ యార్డుకు జిల్లాలోని నలుమూలల నుంచే కాకుండా పొరుగు జిల్లా అయిన సంగారెడ్డిలోని నారాయణఖేడ్, ఆందోల్ తదితర ప్రాంతాల నుంచి భారీగానే పత్తి తీసుకు వస్తుంటారు. కానీ మార్కెట్‌లో వ్యాపారులు తక్కువ ధరకే పత్తిని కొనుగోలు చేస్తున్నారు. క్వింటాల్ పత్తి రూ.6,500ల నుంచి రూ.6,700లకు కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.7,020 మద్దతు ధర ప్రకటించిన రైతులకు ఆ ధర లభించడం లేదు. పత్తి నాణ్యతగా లేదని సాకులు చూపుతూ రైతులను వ్యాపారులు బురిడీ కొట్టిస్తూ కొనుగోళ్లు సాగిస్తున్నారు. సీసీఐకి వెళితే నాణ్యత పేరుతో కోతలు విధిస్తున్నారని రైతులు మండిపడుతున్నారు.

జిల్లాలో 28వేల ఎకరాల్లో పత్తి సాగు

జిల్లాలో పత్తి పంటను రైతులు ఎక్కువగానే సాగు చేస్తుంటారు. మద్నూర్, పెద్దకొడప్‌గల్, జుక్కల్, పిట్లం, నిజాంసాగర్, సదాశివనగర్, గాంధారి, తాడ్వాయి, రాజంపేట తదితర మండలాల్లో వేల ఎకరాల్లోనే రైతులు పత్తి పంటను సాగు చేశారు. ఈ ఏడాది 28వేల ఎకరాల్లో పత్తి సాగైంది. అయితే వాతావరణం అనుకూలించకపోవడంతో పత్తి దిగుబడులు పూర్తిగా తగ్గాయి. జిల్లాలోని పత్తి రైతులు ఎక్కువగా పత్తి పంటపైనే ఆధారపడి సాగు చేస్తున్నారు. అతివృష్టి, అనావృష్టి తెగుళ్ల బెడద, పూత, కాత సమయంలో వర్షాలు కురవకపోవడంతో ఆశించిన స్థాయిలో పంట దిగుబడి రాలేదు. ఎకరాకు 7 నుంచి 12 క్వింటాళ్ల వరకు పత్తి దిగుబడి వచ్చేది. ఈసారి 5 నుంచి 6 క్వింటాళ్లలోపే దిగుబడి వస్తుందని రైతులు చెబుతున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా 2లక్షల క్వింటాళ్ల మేర దిగుబడులు వస్తాయని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. మరోవైపు కూలీల ఖర్చు కూడా అమాంతంగా పెరిగింది. కూలీ రూ.300 నుంచి రూ.400ల వరకు డిమాండ్ చేస్తున్నారు.

ఆశించిన ధర లేక నిరాశ

పత్తి రైతుకు ఆశించిన ధర లేక తెల్లబోతున్నారు. గత సంవత్సరం సీసీఐ మద్దతు ధర 6,920 ఉండగా ప్రైవేట్‌లో పత్తి నాణ్యతను బట్టి రూ.9వేల నుంచి రూ.10 వేల వరకు ధర పలికింది. ఈ ఏడాది కూడా సీసీఐ మద్దతు అంతే ఉండగా ప్రైవేట్‌లో రూ.6,500ల నుంచి రూ.6,700ల వరకే పలుకుతుండడంతో రైతులు దిగాలు చెందుతున్నారు. రైతులకు డబ్బు అత్యవసరమై సీసీఐ కేంద్రాలకు వెళ్లలేక ప్రైవేట్ వ్యక్తులకు విక్రయించి ఆర్థికంగా నష్టపోతున్నారు. అంతర్జాతీయ మార్కెట్‌లో కాటన్ ధరలు, పత్తి గింజల ధరలు, పత్తి నూనెల ధరలపైనే పత్తి రేటు ఆధారపడి ఉంటుందని అధికారులు చెబుతున్నారు. నాణ్యత లేని కారణంతో వ్యాపారులు పత్తి ధరను అమాంతంగా తగ్గించేస్తున్నారు. దీంతో క్వింటాల్‌కు రూ.300ల నుంచి రూ.500ల వరకు రైతులు తక్కువగా విక్రయిస్తూ నష్టపోతున్నారు.

సీసీఐలో అమ్మకాలకు విముఖత

జిల్లాలో మద్నూర్ మండలంలోని ప్రభుత్వపరంగా సీసీఐ కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసి రైతుల నుంచి పత్తి కొనుగోళ్లు చేపడుతుంటారు. అదేవిధంగా మద్నూర్, పెద్దకొడప్‌గల్‌లో ఆరు జిన్నింగ్ మిల్లులు ఉన్నాయి. అయితే ఇప్పటి వరకు మద్నూర్ మార్కెట్‌లో సీసీఐ ప్రభుత్వ కొనుగోలు కేంద్రంలో 40.25 వేల క్వింటాళ్ల పత్తి కొనుగోలు చేయగా ప్రైవేట్ వ్యక్తులు 86 వేల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేపట్టారు. సీసీఐ కొనుగోలు కేంద్రాల్లో పత్తి విక్రయించేందుకు రైతులు ఆసక్తి చూపడం లేదు. ఈ కేంద్రంలో పత్తిని విక్రయిస్తే మద్దతు ధర లభిస్తుందని రైతులు కేంద్రాల వద్దకు వెళితే అక్కడ కొనుగోళ్లలో విధించే నిబంధనలు రైతులకు ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. పత్తి నల్లగా ఉందని నాణ్యత లేదని క్వింటాల్‌కు 4 నుంచి 5 కిలోల కోత విధిస్తున్నారని రైతు లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అంతేకాకుండా పత్తిని అమ్మిన పక్షం రోజులు దాటితే కానీ రైతుల ఖాతాలో సొమ్ము జమ కావడం లేదు. దీంతో సీసీఐలో కాకుండా ప్రైవేట్ వ్యాపారుల వద్దకు వెళ్తుండడంతో వారు చెప్పిన ధరకే విక్రయించి నష్టపోవాల్సి వస్తు ం ద ని రైతులు వాపోతున్నారు. కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా వచ్చే పరిస్థితి కనపడడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీసీఐలోనే ఎలాంటి నిబంధనలు లేకుండా మద్దతు ధరకు కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

నిగ్గు తేలేనా?

- దేవునిపల్లి పీహెచ్‌సీలోని వైద్యుల నిర్వాకంపై తీవ్ర చర్చ
- విధులకు హాజరు కాకుండా సంతకాలు చేస్తున్నది ఎవరు?
- ఎక్కువ శాతం కిందిస్థాయి సిబ్బందే చికిత్సలు అందిస్తారని సమాచారం
- మరికొందరు సిబ్బంది సంతకాలు పెట్టి వెళ్లిపోతుంటారని ఆరోపణలు
- అసలు ఆ ఆసుపత్రి వైపు కన్నెత్తి చూడని ఉన్నతాధికారులు

కామారెడ్డి టౌన్, జనవరి 12: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని దేవునిపల్లి పీహెచ్‌సీలో అసలు విధులకు హాజరుకాకుండానే సంతకాలు పెడుతున్న వైద్యుల నిర్వాకంపై వైద్య ఆరోగ్యశాఖలోనే కాకుండా ఆ పీహెచ్‌సీ పరిధిలో ఉన్న ప్రజలల్లో తీవ్ర చర్చసాగుతోంది. అసలు ఆ ఆసుపత్రుల్లో ముగ్గురు వైద్యులు ఉండడాన్ని తాము ఎప్పుడు చూడలేదని ఒకరిద్దరు వైద్యులు అసలు విధులకే హాజరుకారని అలాంటప్పుడు సంతకాలు ఎలా వస్తున్నాయని సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. ఆయా పీహెచ్‌సీలను పర్యవేక్షించాల్సిన అధికారులు కేవలం వారు ఆఫీసుకు వచ్చే వెళ్లే దారిలో ఉన్న పీహెచ్‌సీలను మాత్రమే పలుమార్లు సందర్శిస్తారే తప్ప ఈ పీహెచ్‌సీలను అసలు పరిశీలించిన దాఖలాలు లేవని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ ఆసుపత్రిలో పని చేసే ఇద్దరు వైద్యులు వేరే జిల్లాలో ఉంటుండగా మరో వైద్యురాలు మాత్రం కామారెడ్డి జిల్లాలో ఉంటుంది. ఇందులో ఒకరు మాత్రమే విధులకు హాజరవుతారని మరో ఇద్దరు వారికి నచ్చినవిధంగా హాజరవుతారని నెలల తరబడి కూడా హాజరు కాని సందర్భాలు చాలానే ఉన్నాయని సమాచారం. అయితే ప్రస్తుతం ఆయా మెడికల్ ఆఫీసర్‌లకు మెమోలు జారీ చేసి వివరణ కోరేందుకు అధికారులు సిద్ధమయ్యారని గతంలో మాదిరి ఈ విచారణను సైతం పక్కాగా చేపట్టి నిగ్గు తెలుస్తారా.. నీరు గారుస్తారా అనేది తేలాల్సి ఉంది.

విధులకు హాజరు కాకుండా సంతకాలు చేస్తున్నది ఎవరు?

ప్రభుత్వ వైద్యులై ఉండి విధులకు హాజరై ఆసుపత్రికి అనారోగ్యంతో వస్తున్న ప్రజలకు సేవలు అందించాల్సి ఉండగా అటువైపు కన్నెత్తి చూడరనేది బహిరంగ రహస్యం. విధులకు హాజరు కాని మెడికల్ ఆఫీసర్‌ల సంతకాలను ఎవరు.. ఎందుకు పెడుతున్నారనేది నిగ్గు తేలాల్సి ఉంది. అయితే ఈ ఆసుపత్రిలో పనిచేసే అధికారులు, సిబ్బంది మధ్య మంచి షేరింగ్ విధానం ఉంటుందని 18 మంది సిబ్బంది ఉన్న ఆసుపత్రిలో సగానికి పైగా వారికి నచ్చిన సమయంలో వచ్చి వెళ్తుంటారని పర్యవేక్షణ చేయాల్సిన మెడికల్ ఆఫీసర్‌లే తమ విధులను సక్రమంగా చేయరని వాళ్ల లేనిది తామేందుకు విధులు నిర్వహించాలనే భావనలో ఉంటారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఉన్న కొద్దిపాటి కిందిస్థాయి సిబ్బందే చికిత్స అందిస్తారని సమాచారం. ఆసుపత్రికి వచ్చే ప్రజలు ఎవరైన వైద్యులు ఎక్కడ అని ప్రశ్నిస్తే చాలు వారిపై విరుచుకుపడుతారని మీకు ఇంతకంటే ఎక్కువ వైద్యం చేస్తారా అంటూ బెదిరిస్తారని ఆ పీహెచ్‌సీ పరిధిలోని పలువురు ప్రజలు పేర్కొంటుండడం గమనార్హం. విధులకు హాజరు కాకుండా సంతకాలు పెడుతున్న విషయం బయటకు పొక్కడంతో అధికారులు విచారణ చేసేందుకు సిద్ధమయ్యారు. సదరు మెడికల్ ఆఫీసర్‌లకు మెమోలు జారీ చేసి వారి వివరణ కోరారు. ఆ తర్వాత తగిన చర్యలు తీసుకునేందుకు ఉన్నతాధికారులకు నివేదికను అందించనున్నారు. దీంతో విచారణను అడ్డుకునేందుకు పలువురు నానా ప్రయత్నాలు చేస్తున్నారని తెలుస్తోంది.

ఆరోగ్యశాఖ అధికారుల పట్టింపు కరువు

జిల్లాలోని పీహెచ్‌సీలను ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేసి వైద్యులు విధులు ఎలా నిర్వర్తిస్తున్నారు. వారు ఏ సమయానికి వస్తున్నారు.. ఏ సమయానికి వెళ్తున్నారనేది ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ డివిజన్ స్థాయి అధికారి ఒక్కో పీహెచ్‌సీని నెలలో కనీసం 4 నుంచి 6 సార్లు, జిల్లా స్థాయి అధికారి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేయాల్సి ఉంటుంది. అయితే డివిజన్‌ల స్థాయి అధికారులు వారికి ప్రధాన రహదారుల వెంట ఉండే వాటిని, మండల హెడ్ క్వార్టర్స్‌లో ఉండేవాటిని, జిల్లా కేంద్రానికి సమీపంలో ఉండే వాటిని మాత్రమే తనిఖీల పేరిట వెళ్తుండడంతో మిగిలిన పీహెచ్‌సీలలో పనిచేసే వారు చేసిందే పనిగా నడుస్తోంది. ఇప్పటి వరకు ఎన్ని పీహెచ్‌సీలను సందర్శించారనే దానిపై మూమెంట్ రిజిష్టర్లను జిల్లా ఉన్నతాధికారులు పరిశీలన చేస్తే ఏ స్థాయిలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు తమ విధులను నిర్వహిస్తున్నారనే విషయం బట్టబయలు అయ్యే అవకాశం ఉంటుంది.

ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీ ఎదుట
పెద్దమల్లారెడ్డి గ్రామస్థుల ధర్నా

- బాధిత కుటుంబానికి ఒప్పుకున్న నష్టపరిహారం ఇవ్వడం లేదని ఆగ్రహం
- త్వరలోనే చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమణ



భిక్కనూరు ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీ ఎదుట ధర్నా చేస్తున్న స్థానికులు

భిక్కనూరు, జనవరి 12: భిక్కనూరు గ్రామ శివారులోని ఎంఎస్ఎన్ ఫార్మా కంపెనీ ఎదుట మండలంలోని పెద్దమల్లారెడ్డి గ్రామస్థులు శుక్రవారం ధర్నా నిర్వహించారు. వివరాల్లోకి వెళ్లితే.. గ్రామానికి చెందిన బుడ్డ యాదగిరి ఎంఎస్ఎన్ కంపెనీలో కొంత కాలంగా పని చేస్తున్నాడు. గత డిసెంబరు 8న ప్రతీరోజు మాదిరి విధుల్లోకి వచ్చిన యాదగిరి ఉన్నట్టుండి స్పృహతప్పి పడిపోయాడు. దీంతో వెంటనే ఫ్యాక్టరీ సిబ్బంది మెదక్ జిల్లా రామాయంపేటలోని ఆసుపత్రికి తరలించారు. అయితే యాదగిరి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించడంతో మృతదేహాన్ని గ్రామానికి తీసుకువచ్చారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులు గ్రామస్థులతో కలిసి ఫ్యాక్టరీ వద్దకు చేరుకుని కంపెనీ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేసి మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేయడంతో మృతుడి కుటుంబానికి రూ.6 లక్షలు ఇవ్వడానికి కంపెనీ యాజమాన్యం, అధికారులు ఒప్పుకున్నారు. ఈ మేరకు రూ.లక్షను చెల్లించగా మిగితా రూ.5లక్షలను త్వరలోనే ఇస్తామని హామీ ఇచ్చారు. కానీ అప్పటి నుంచి బాధిత కుటుంబ సభ్యులు ఫోన్ చేసినా.. కంపెనీ వద్దకు వచ్చినా కంపెనీ అధికారులు స్పందించకపోవడంతో గ్రామస్థులతో కలిసి కంపెనీ వద్దకు పెద్దసంఖ్యలో చేరుకుని కంపెనీ గేటు ఎదుట వారు ఆందోళన నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న కంపెనీ యాజమాన్యం సాయంత్రం లోగా మిగితా డబ్బులను అందజేస్తామని హామీ ఇవ్వడంతో గ్రామస్థులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

హరితహారం లక్ష్యాలను పూర్తి చేయాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్

కామారెడ్డి టౌన్, జనవరి 12: తెలంగాణ హరితహారం కింద నిర్దేశించిన లక్ష్యాలను పూర్తిస్థాయిలో సాధించేందుకు అధికారులు ప్రణాళికబద్ధంగా చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో హరితహారం కార్యక్రమంపై జిల్లా అటవీశాఖాధికారి వికాస్‌మీనాతో కలిసి అన్ని శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2025-26 వార్షిక సంవత్సరాలలో వివిధ శాఖల ద్వారా మొక్కలు నాటుటకు లక్ష్యాలను నిర్ధేశిస్తూ ప్రణాళికబద్ధంగా ముందుకు సాగాలని కోరారు. అధికారులు లక్ష్యం సాధించాలనే తపన తో కాకుండా మనస్సు పెట్టి నాటిన ప్రతీ మొక్క పాడవకుండా జీవించేలా చూడాలని, ఔషధ మొక్కలు, నీడ నిచ్చే మొక్కలు, పూల మొక్కలు, రహదారుల వెంట పెద్ద మొక్కలు నాటాలని అన్నారు. 2024 సంవత్సరంలో 26లక్షల 40వేల మొక్కలు నాటాలని లక్ష్యంగా నిర్ధేశించుకున్నామని, 2025 సంవ త్సరంలో 17లక్షల 92వేల మొక్కలు నాటుటకు కార్యాచరణ రూపొందించామని తెలిపారు. 2026 నాటికి మొక్కలు నాటుటకు ఇప్పటి నుంచే ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని అన్నారు. క్షేత్రస్థాయిలో నీటి పారుదల కింద బండ్ ప్లాంటేషన్, అటవీశాఖ పరిధిలో బ్లాక్ ప్లాంటేషన్, గ్రామ పంచాయతీలు, విద్యాసంస్థలు, వసతి గృహాలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ సంస్థల్లో ఖాళీ ప్రదేశాలను గుర్తించి మొక్కలు నాటాలన్నారు. ప్రధానంగా కరివేపాకు, మునగ, ఉసిరి,చింత, వెలగ వంటి మొక్కలతో పాటు తులసి, అలోవేరా, రణపాల వంటి ఔషధ మొక్కలు నాటాలని కోతులు దరిచేరవని అన్నారు. కోతులు బయట సంచరించకుండా అటవీ లోపల పండ్ల మొక్కలు నాటాలని అన్నారు. ఎన్ఆర్‌జీఎస్ కింద రైతులు పండ్ల మొక్కలు నాటేలా ప్రోత్సహించాలని, ఆయిల్ పాంలను ప్రోత్సహించాలన్నారు. పశువులకు గడ్డి కోసం, ప్లాంటేషన్ చేయాలన్నారు. ప్రధానంగా విద్యుత్ శాఖ వారు విద్యుత్ తీగలకు అడ్డువస్తున్నాయని చెట్లు నరుకుతున్నారని, ఇది ఎంత మాత్రం సమంజసం కాదని, ముందస్తుగా సంబంధిత అధికారులకు తెలపాలని, లేకుంటే అటవీ చట్టం, ఆర్ఆర్ చట్టం ప్రకారం తగు చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీవో సాయన్న, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

రైసు మిల్లును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్



నెలాఖరులోగా సీఎంఆర్‌ను అప్పగించాలి

కామారెడ్డి టౌన్, జనవరి 12: జిల్లాలో రైసుమిల్లర్లు ఎఫ్‌సీఐకీ ఇవ్వాల్సిన సీఎంఆర్‌ను ఈ నెలాఖరులోగా పూర్తి చేసి ఇవ్వాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రమోహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని చిన్నమల్లారెడ్డి రైసుమిల్లును ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైసుమిల్లుల యజమానులు రోజువారి లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. లేకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. లక్ష్యం పూర్తిచేయని మిల్లులను సీజ్‌చేసి యజమానులపై క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లిఖార్జున్‌బాబు, పౌర సరఫరాల అధికారి జిల్లా మేనేజర్ అభిషేక్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.

టీయూ బాలికల హాస్టల్

సమస్యలు అధికారులకు పట్టవా?

- గత కొన్నేళ్లుగా మొరపెట్టుకున్నా పట్టించుకోని ప్రభుత్వం
- ఇరుకు హాస్టల్‌లోనే బిక్కుబిక్కుమంటూ వెల్లదీస్తున్న బాలికలు
- నూతన హాస్టల్ నిర్మించాలని డిమాండ్ చేస్తున్న బాలికలు
- కొత్త ప్రభుత్వంపైనే ఆశలు



డిచ్‌పల్లి, జనవరి 12 : దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు దాటింది. అన్ని విభాగాల్లో మహిళలకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని ప్రభుత్వాలు చెబుతున్న తెలంగాణ యూనివర్సిటీలో మాత్రం మహిళల విద్యార్థినులపై కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలకు చిన్నచూపు ఉన్నట్లే కనబడుతుంది. ఎందుకంటే గత 10ఏళ్లుగా బాలికల హాస్టల్ ఇరుకుగా మారి బాలికలకు నూతనంగా మరో హాస్టల్ నిర్మించాలని డిమాండు చేస్తున్నారు. అటు వర్సిటీ ఉన్నతాధికారులు గానీ, ప్రభుత్వం గానీ పట్టించుకోవడం లేదు. మహిళలు అందరూ అక్షరాస్యత ముందజలో ఉండాలనేది ప్రకటనలకే మాత్రం పరిమితమవుతుంది. చదువుకుందామంటే కనీసం వసతి కల్పించాలేని పరిస్థితి తెలంగాణ యూనివర్సిటీలో నెలకొంది. యూనివర్సిటీ ప్రారంభం అనంతరం నిర్మించిన బాలికల హాస్టల్ అప్పటి కోర్సుల స్థాయిని బట్టి 250 మంది విద్యార్థినుల కెపాసిటీ కోసం నిర్మించారు. కానీ యూనివర్సిటీ ప్రతి ఏటా అడ్మిషన్స్‌లో బాలికలే అధికంగా సీట్లు సాధించడం వల్ల ఈ యూనివర్సిటీ హాస్టల్ వారికి సరిపోవడం లేదు. 250మంది కోసం నిర్మించిన ఈ హాస్టల్‌లో ప్రస్తుతం 480మంది ఉంటున్నారంటే పరిస్థితి ఏంటో అర్థం చేసుకోవచ్చు. బాలికలకు నూతన హాస్టల్ నిర్మించాని గత పదేళ్లుగా విద్యార్థినిలు, విద్యార్థి సంఘాలు ఏన్నో సార్లు ధర్నాలు చేశారు. కానీ ఎటువంటి స్పందన రాలేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో కనీసం ఒక్క ప్రజాప్రతినిధి కూడా తెలంగాణ యూనివర్సిటీని సందర్శించకపోవడం, విశ్వవిద్యాలయం పట్ల ప్రభుత్వం చిన్న చూపు కనబర్చడం, వీసీ వర్సెస్ పాలక మండలి మధ్య వివాదలతో ప్రభుత్వం ఈ వర్సిటీని పట్టించుకోలేదు. కనీసం అభివృద్ధి చేయలేదు. దీంతో నిధుల లేమితో వర్సిటీ పాలన పూర్తిగా కుంటుపడింది. ఏదో ఒక డిగ్రీ కళాశాల లాగా తూతు మంత్రంగా వర్సిటీని నడిపిస్తున్నారు. బాలికల హాస్టల్‌లో ఒక్కో గదిలో 20మంది ఉంటు ఇబ్బందులు పడుతున్నారు. కనీసం మూత్రశాలలు, స్నానాల గదులు సరిపోక ప్రతిరోజు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. హాస్టల్ పక్కనే గుట్ట అటవీ ప్రాంతం ఉండటంతో విషప్రాణులు హాస్టల్‌లోకి తరుచు వస్తున్నాయి. హస్టల్ కనీస మౌలిక సదూపాయలు లేక విద్యార్థినులు అవస్థలు పడుతున్నారు. తెలంగాణ యూనివర్సిటీని గతంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం, తిరిగి రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిందని వెంటనే యూనివర్సిటీ హాస్టల్ సమస్యలతో పాటు వర్సిటీని అభివృద్ధి చేస్తుందని విద్యార్థినులు, విద్యార్థి సంఘాల నాయకులు ఆశభావం వ్యక్తం చేస్తున్నారు. వారి అవస్థలను ప్రభుత్వం పట్టించుకుని తెలంగాణ యూనివర్సిటీని ప్రక్షాళన చేసి ఇన్‌చార్జ్ వీసీని తొలగించి పూర్తిస్థాయి వైస్ చాన్స్‌లర్ నియ మించాలని వర్సిటీ రాష్ట్ర బడ్జెట్‌లో అధికనిధులు కేటాయించాలని విద్యార్థులు కోరుతున్నారు.

పిప్రి సొసైటీలో వ్యవసాయ రుణాల పంపిణీ

ఆర్మూర్ రూరల్, జనవరి 12: ఆర్మూర్ మండలం పిప్రి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శుక్రవారం ఇటీవల 17మంది సభ్యులకు రుణమాఫీ కాగా మాఫీ అయిన రైతులకు నూతన వ్యవసాయ రుణాలను సొసైటీ చైర్మన్ హేమంత్‌రెడ్డి అందజేశారు. రూ.14లక్షల 85 వేలను రైతులకు అందజేశారు. కార్యక్రమంలో సీఈవో హన్మండ్లు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఆలూర్‌లో..

ఆలూర్ మండల కేంద్రంలోని వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో ముద్రించిన సొసైటీ క్యాలెండర్‌ను పీఏసీఎస్ చైర్మన్ తంబురి శ్రీనివాస్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో వైస్‌చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, డైరెక్టర్‌లు కల్లెం బోజారెడ్డి, బార్ల సంతోష్‌రెడ్డి, కల్లెం సాయిరెడ్డి, గోవర్ధన్, ప్రమోద్‌కుమార్, ఆరే రాజేశ్వర్, నర్సారెడ్డి, సీఈవో తొర్తి మల్లేష్ ఉన్నారు.

పంచాయతీ భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే

భీమ్‌గల్ రూరల్, జనవరి 12 : వేల్పూర్ మండలం అక్లూర్ గ్రామంలో శుక్రవారం నూతనంగా నిర్మించిన గ్రామ పంచాయతీ భవనాన్ని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. ఎమ్మెల్యేగా గెలిచిన అధికారికంగా మొదటిసారి గ్రామానికి వచ్చిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి గ్రామస్థులు, మహిళలు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం జీపీ భవనాన్ని ఎమ్మెల్యే ప్రశాంత్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ జైడి నాగాధర్‌రెడ్డి, ఎంపీటీసీ డొల్ల రాజేశ్వర్‌రెడ్డి, ఎంపీపీ బీమ జమున, జడ్పీటీసీ అల్లకొండ భారతి రాకేష్‌చంద్ర, నీడీపీవో సుధారాణి, నీరజ, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఇంటిని సీజ్ చేసిన బ్యాంకు అధికారులు

లోన్ డబ్బులు చెల్లించలేదని ఇల్లు సీజ్

భిక్కనూరు, జనవరి12: ఇంటి నిర్మాణానికి తీసుకున్న డబ్బులు చెల్లించడం లేదని, పలు నోటీసులు పంపించిన స్పందించకపోవడంతో బ్యాంకు అధికారులు ఇంటిని సీజ్ చేసిన ఘటన శుక్రవారం భిక్కనూరు మండల కేంద్రంలో చోటుచేసుకుంది. భిక్కనూరు కెనరా బ్యాంకు రీజినల్ అధికారి చంద్రభూషణ్ తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన రేష్మ కొంతకాలం క్రితం భిక్కనూరు కెనరా బ్యాంకులో రూ.12లక్షల హౌసింగ్ లోన్ తీసుకుంది. తీసుకున్న లోన్ సరిగా కట్టకపోవడంతో బ్యాంకు నిబంధనల ప్రకారం తీసుకున్న రూ.12లక్షలకు రూ.లక్షా50వేల వడ్డీ అయ్యింది. డబ్బులు కట్టాలని రేష్మకు నోటీసులు పంపినా స్పందించకపోవడంతో బ్యాంకు నిబంధనల ప్రకారం తహసీల్దార్ శివప్రసాద్, ఏఎస్సై జగదీష్ సమక్షంలో ఇంటిని ఖాళీ చేయించి సీజ్ చేశారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది భార్గవ్, సుధీర్, ఈశ్వర్, బాబు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

దుబాయ్‌లో బోనాల్ వాసి మృతి

లింగంపేట, జనవరి12: లింగంపేట మండలంలోని బోనాల్ గ్రామానికి చెందిన గరిగె ప్రభాకర్ (32) దుబాయ్‌లో రెండురోజుల క్రితం మృతి చెందినట్లు శుక్రవారం గ్రామస్థులు తెలిపారు. దుబాయ్‌లోని పవర్ రిక్రూట్‌మెంట్ ఎల్ఎల్‌సీ కంపెనీలో పనిచేయడానికి 2023 మే నెలలో ఇంటి నుంచి వెళ్లినట్లు తండ్రి పర్వయ్య తెలిపారు. మే 11న తాను దుబాయ్ చేరుకున్నానని ఫోన్ చేసినట్లు ఆయన తెలిపాడు. అనంతరం కుటుంబ సభ్యులతో కాంటాక్టులో లేడని శుక్రవారం మృతి చెందినట్లు సమాచారం వచ్చినట్లు మృతుడి భార్య రాధ తెలిపారు. మృతదేహాన్ని స్వగ్రామానికి పంపేందుకు దుబాయ్‌లోని గల్ఫ్ బాధితుల సంఘం అధ్యక్షుడు గుండెల్లి నర్సింలు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారని చెప్పారు. శవం కోసం కుటుంబీకులు ఎదురు చూస్తున్నారు.

సైకిల్‌ను ఢీకొన్న బైక్: ఇద్దరి మృతి

భిక్కనూరు, జనవరి12: రోడ్డు దాటుతున్న సైకిల్‌ను బైకు ఢీకొట్టడంతో ఇద్దరు మృతిచెందారు. ఈ ఘటన భిక్కనూరు మండలంలోని జంగంపల్లి గ్రామంలో శుక్రవారం సాయంత్రం చోటుచేసుకుంది. భిక్కనూరు ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. జంగంపల్లి గ్రామానికి చెందిన గుండా వెంకటి (46) గ్రామంలో 44వ జాతీయరహదారి పక్కన దాబాలో పని పూర్తి చేసుకుని ఇంటికి వెళ్లేందుకు రోడ్డు దాటుతుండగా.. కామారెడ్డి నుంచి భిక్కనూరువైపు తన బైక్‌పై వస్తున్న దోమకొండ గ్రామానికి చెందిన నిఖిల్, సుమంత్ అతివేగంగా వచ్చి సైకిల్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో వెంకటి అక్కడిక్కడే మృతిచెందగా, తీవ్రంగా గాయపడిన నిఖిల్ (24)ను కామారెడ్డికి చికిత్స నిమిత్తం తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఇదే ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన సుమంత్ కామారెడ్డి ఏరియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు ఎస్సై తెలిపారు. రోడ్డు ప్రమాద విషయం తెలుసుకున్న మృతుల కుటుంబీకులు పెద్దఎత్తున ఘటనా స్థలానికి చేరుకుని బోరున విలపించారు. మృతుడు వెంకటికి భార్య లక్ష్మీ, ఇద్దరు కుమారులు రాకేష్, గణేష్ ఉన్నారు.

యువజన దినోత్సవం

ఆర్మూర్ టౌన్, జనవరి 12: పట్టణంలోని లయన్స్ భవన్‌లో లయన్స్ క్లబ్ నవనాథపురం ఆధ్వర్యంలో శుక్రవారం యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు ఈ సందర్భంగా జిల్లాకు చెందిన టెన్నిస్‌బాల్ క్రికెట్ క్రీడాకారుడు స్పోర్ట్స్ కోటలో జార్ఖండ్ రాష్ట్రంలో ఉద్యోగం సంపాదించిన వికాస్‌ను లయన్స్ సభ్యులు ఘనంగా సన్మానించారు. అనంతరం. వివేకానంద జయంతి సందర్భంగా వివేకానంద చిత్రపటానికి లయన్స్‌క్లబ్ సభ్యులు పూలమాల వేసి నివాళులు అర్పించారు. వివేకానంద చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ వైస్‌గవర్నర్ అమర్‌నాథ్, లయన్స్‌క్లబ్ అధ్యక్షుడు మోహన్‌దాస్, కోశాధికారి రఫీయోద్దీన్, సామల లక్ష్మీనారాయణ, జీవీ.నర్సింహరెడ్డి, డికె.రాజేష్, అంబల్ల శ్రీనివాస్, ఎం.రాజన్న, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

కమ్మర్‌పల్లి, జనవరి12: భారతదేశ ఖ్యాతిని ఖండాంతరాలు దాటించిన స్వామి వివేకానంద జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఈసందర్భంగా ఆయన చిత్రపటాలు, విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కమ్మర్‌పల్లి ఉన్నత పాఠశాలలో స్వామి వివేకానంద జయంతి ఉత్సవాల్లో హెచ్ఎం పసుపుల సాయన్న, ఉపసర్పంచ్ పాలెపు చిన్న గంగారం, పంచాయతీ కార్యదర్శి శాంతికుమార్, వివేకానంద యూత్ సభ్యులు వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూత్ సభ్యులు రాజశేఖర్, ప్రభాకర్, సల్లూరి కిషన్‌గౌడ్, నల్ల గణేష్ గుప్త, మామిడి నరేష్, నవాతె రంజీత్ సున్నం మోహన్, కూన గంగాధర్ యూత్‌సభ్యులు పాల్గొన్నారు. అలాగే చౌట్‌పల్లి, బషీరాబాద్ గ్రామాల్లోనూ స్వామి వివేకానంద జయంతిని ఘనంగా జరుపుకున్నారు.

● నేటి యువత వివేకానందుని అడుగు జాడల్లో నడవాలి

ధర్పల్లి: నేటి యువత వివేకానందుని అడుగు జాడల్లో నడవాలని ఎంపీపీ సారిక హన్మంత్‌రెడ్డి యువతకు సూచించారు. శుక్రవారం వివేకానంద జయంతి సందర్భంగా యువజనోత్సవ కార్యక్రమాన్ని స్థానిక మండల కేంద్రంలో నిర్వహించారు. కార్యక్రమానికి ఎంపీపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. చాణక్య టెక్నికల్ ఇన్‌స్టిట్యూట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సీఐ సైదా, ఇన్‌స్టిట్యూట్ సిబ్బంది ప్రణీత్ పాల్గొన్నారు.

హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక

ఆర్మూర్ రూరల్, జనవరి 12: మండలంలోని చేపూర్‌లోని క్షత్రీయ పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ లక్ష్మీనర్సింహస్వామి తెలిపారు. పాఠశాల విద్యార్థులు నమ్రత, ప్రితిక, హరిణి, శ్రీనిధి, లితిక్ష, శృతిక, హరిణి ఎంపికయ్యారు. ఈనెల 15నుంచి అసిఫాబాద్‌లో జరగనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన విద్యార్థినీలను ప్రిన్సిపాల్, పాఠశాల యాజమాన్యం అభినందించారు.

సరస్వతి శిశుమందిర్‌లో సంక్రాంతి సంబరాలు

ముప్కాల్, జనవరి 12: సంక్రాంతి పర్వదినం పురస్కరించుకొని పాఠశాలలో సంక్రాంతి సంబరాలు జరుపుకున్నారు. శుక్రవారం ముప్కాల్ మండల కేంద్రంలోని సరస్వతి శిశుమందిర్ సంక్రాంతి సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు హరిదాసు వేషాధారణలో ఆటలు, పాటలు అలరించాయి. మహిళలు పెద్దఎత్తున రంగురంగుల ముగ్గులు వేసి సంక్రాంతి వేడుకలను జరుపుకున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు దయానంద్ పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, పూర్వ విద్యార్థులు దినేష్, కమిటీ సభ్యుడు ఒడ్డెన్న, చంద్రమోహన్, గంగాధర్, తదితరులు పాల్గొన్నారు.



వివిధ వేషధారణలో విద్యార్థులు

కొత్త మండలంలో..

అందని వివిధ శాఖల సేవలు!

● డొంకేశ్వర్‌లో ఒక్క తహసీల్ కార్యాలయమే.. ● ఏ సమస్య వచ్చినా ఉమ్మడి మండలానికే పరుగులు ● అన్ని శాఖల సేవలందించాలంటున్న ప్రజలు

డొంకేశ్వర్, జనవరి12: ప్రజల పరిపాలనా సౌలభ్యం పేరుతో కొత్త మండలాలను ఏర్పాటుచేసిన గత ప్రభుత్వం ఒక్క తహసీల్ కార్యాలయం మినహా ఏ కార్యాలయాన్నీ ఏర్పాటు చేయకుండానే వదిలేసింది. దీంతో పేరుకే కొత్త మండలమని, ప్రతీ పనికి ఉమ్మడి మండలానికే పరుగులు పెట్టాల్సి వస్తోందని మండలాల్లోని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల పరిపాలనా సౌలభ్యం కోసమని గత బీఆర్ఎస్ ప్రభుత్వం నందిపేట్ మండలంలో ఉన్న డొంకేశ్వర్‌ను కొత్త మండలం గా ఏర్పాటు చేసింది. డొంకేశ్వర్ మండలం ఏర్పాటై దాదాపు ఏడాది గడిచినా ఒక్క తహసీల్దార్ కార్యాలయం మినహా ఇప్పటివరకు ఏ కార్యాలయమూ ఏర్పాటు కాలేదు. దీంతో మండల ప్రజలు కొత్త మండలంలో వివిధరకాల ప్రభుత్వసేవలను అందక ఇబ్బంది పడుతున్నారు. ప్రతీ పనికి ఉమ్మడి మండలానికి పరుగులు పెడుతున్నారు.

● అందుబాటులోకి రాని శాఖల సేవలు

మండలస్థాయి ప్రతీ మండలంలో ఎంపీడీవో, ఎంఈవో, ఐకేపీ, ఉపాధిహామీ, వ్యవసాయ, ఐసీడీఎస్, ఇరిగేషన్, వివిధ శాఖలు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. మిగతా శాఖల కోసం మండల కేంద్రంలో భవనాలు అందుబాటులో ఉంచారు. అందుబాటులో లేని శాఖల సేవల కోసం ఉమ్మడి నందిపేట మండలానికి వెళ్తున్నారు. నూతన మండలం ఏర్పడితే సమస్యలు త్వరితగతిన పరిష్కారం అవుతాయని భావించిన ప్రజలకు మళ్లీ అవే సమస్యలు ఎదురవుతున్నాయి.



డొంకేశ్వర్‌లో తహసీల్దార్ కార్యాలయం

● వ్యవసాయ శాఖ కార్యాలయం లేక ప్రజల అవస్థలు

ఉమ్మడి నందిపేట మండలానికి బయలు దేరాల్సి వస్తోంది. నూతన మండలం ఏర్పడిన ఇక్కడ మిగతా శాఖల సేవలు అందకపోవడంతో మండల ప్రజలు నిరుత్సాహంగా ఉన్నారు. ఈ ప్రాంతంలో ఎక్కువగా రైతులు వ్యవసాయం మీద ఆధారపడి ఉంటారు. ఎక్కువగా వరి, సోయా, పసుపు పంటలు సాగుచేస్తారు. రైతులకు సలహాలు, సూచనలు చేసేందుకు వ్యవసాయ కార్యాలయం లేక అవస్థలు పడుతున్నారు. ఏదైనా అనుకొని ఘటనలు జరిగినప్పుడు రాత్రి వేళల్లో పెట్రోలింగ్ నిర్వహించేటప్పుడు పోలీసులకు నందిపేట్ నుంచి డొంకేశ్వర్ మండలానికి రావాలంటే ఎక్కువ సమయం పడుతుండడంతో అత్యవసర సేవలను ఆలస్యం అవుతున్నాయి. వ్యవసాయ, ఉపాధిహామీ సమస్యలను పరిష్కరించుకోవడానికి రైతులు కూలీలు నందిపేట్ మండలానికి బయలుదేరాల్సి పరిస్థితి ఉంది. కొత్త మండలం ఏర్పాటైతే సేవలు అందుబాటులోకి వస్తాయి అనుకున్న ప్రజలకు సేవలు అందక మళ్లీ పాత మండలానికి వెళ్లాల్సి వస్తోంది. కొత్త మండలంలో ఎప్పుడు మిగతా కార్యాలయాల సేవలు అందుతాయోనని ప్రజలు ఎదురుచూస్తున్నారు. మిగతా కార్యాలయాలు ఏర్పాటుచేసే శాఖల సేవలు త్వరగా అందించాలని ప్రజలు కోరుతున్నారు.

కార్యాలయాలు లేక ఇబ్బందిగా ఉంది



● పోతుగంటి సురేందర్, బీజేపీ మండల అధ్యక్షుడు, డొంకేశ్వర్

మండలం ఏర్పాటై ఏడాది పూర్తి కావస్తున్నా ఇంకా అన్ని ఆఫీసులు సేవలు లేక ఇబ్బంది పడుతున్నాం. కొత్త మండలంలో ఒక్క రెవెన్యూ సేవలు అందుతున్నాయి మిగతాశాఖల సేవలు కోసం నందిపేట మండలానికి పోవాల్సి వస్తోంది. పైఅధికారులు స్పందించి తొందరగా అన్ని ఆఫీసులు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఇబ్బంది కలగకుండా సేవలు అందుతాయి.

గత ప్రభుత్వంలో మంజూరైన పనులను ఆపొద్దు

● ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి

ముప్కాల్, జనవరి 12: తమ ప్రభుత్వ హయాంలో మంజూరైన పనులను రద్దు చేయకుండా అలాగే కొనసాగించాలని, పనులు నిలిపివేయడం సరైంది కాదని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం బాల్కొండ మండలానికి తొలిసారి పర్యటనకు వచ్చిన ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డికి బాల్కొండ మండల శ్రీరాంపూర్ నుంచి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బైక్‌లు, కార్లతో ఘనస్వాగతం పలికారు. నాగాపూర్ గ్రామంలో రూ.20లక్షలతో నూతనంగా నిర్మించి గ్రామపంచాయతీ భవనాన్ని అధికారులు, నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాల్కొండ నియోజకవర్గంలో గత పదేళ్లలో 114 గ్రామ పంచాయతీలకు 70 గ్రామ పంచాయతీ భవనాలు నిర్మించుకున్నామని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయంలో బీఆర్ఎస్ లెటర్ ప్యాడ్‌మీద మంజూరు చేసినవి కావని, ప్రభుత్వ ఫైనాన్స్ డిపార్ట్‌మెంట్ సెక్రెటరీ అప్రూవల్‌తో వివిధ శాఖలు ప్రిన్సిపాల్ సెక్రెటరీ పనులు నిజామాబాద్, సిరిసిల్ల కలెక్టర్లు తెలంగాణ ప్రభుత్వతరపున బాల్కొండ నియోజకవర్గంలో అభివృద్ధి పనుల కోసం మంజూరు చేసిన వివిధ శాఖలకు సంబంధించి ఆర్అండ్‌బీ, పంచాయతీరాజ్, ఎస్‌డీఎఫ్ పనులు, కులసంఘ భవనాలు, ఆలయాలు, మసీదులు, చర్చీలు, రోడ్లు, బ్రిడ్జిలు, చెక్‌డ్యాంలు గ్రామీణ ఆసుపత్రులు పనులను మంజూరు చేస్తున్నపనులను ఆపకుండా కొనసాగించాలని సీఎం రేవంత్‌రెడ్డికి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క, ఇరిగేషన్ శాఖమంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డిని ప్రజల తరఫున ఎమ్మెల్యే కోరారు. కార్యక్రమంలో మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు ప్రవీన్‌రెడ్డి, జడ్పీటీసీసభ్యుడు దాసరి లావణ్య వెంకటేష్, సొసైటీ ఛైర్మన్ నాగులపల్లి సూరజ్‌రెడ్డి, వన్నెల్ (బి) ఉపసర్పంచ్ నాగులపల్లి కిషన్, కిసాన్‌నగర్ సర్పంచ్ మానేటి తులసీ నాగభూషణం, జలాల్‌పూర్ సర్పంచ్ గడ్పంద కల్పన అనిల్, ఉపసర్పంచ్ లింబారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



నాగాపూర్‌లో జీపీ భవనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

ఏర్గట్ల: గత ప్రభుత్వంలో మంజూరు చేసిన పనులను ఆపొద్దని ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. శుక్రవారం మండలంలోని నాగేంద్రనగర్‌లో రూ.20లక్షలతో నిర్మించిన జీపీ భవనం, తడపాకల్‌లో రూ.20లక్షలతో నిర్మించిన పల్లె దవాఖానాను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజవర్గంలో వివిధ శాఖల ద్వారా రోడ్లు, బ్రిడ్జిలు, చెక్‌డ్యామ్‌లు, సంఘ భవనాలు, ఎస్‌డీఎఫ్ నిధులు మంజూరీ తీసుకొచ్చిన పనులు కొనసాగించాలని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులను కోరుతున్నానని అన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కొలిప్యాక ఉపేందర్‌రెడ్డి, జడ్పీటీసీ గుల్లె రాజేశ్వర్, భారస మండలాధ్యక్షుడు రాజాపూర్ణానందం, సర్పంచ్‌లు పత్తిరెడ్డి ప్రకాష్ రెడ్డి, మోత్కూరి మంజుల బాలాజీ గౌడ్, కోఆప్షన్ సభ్యుడు ఎండీ ఆశ్రఫ్, క్యాతం దేవేందర్, తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న యువకులు

రక్తదాన శిబిరానికి అనూహ్య స్పందన

● ఉత్సాహంగా పాల్గొన్న యువత

కమ్మర్‌పల్లి, జనవరి12: మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో శుక్రవారం వివేకానందయూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరాన్ని అనూహ్య స్పందన లభించింది. గ్రామానికి చెందిన యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. ఈ శిబిరంలో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్రామానికి చెందిన 45మంది యువకులు రక్తాన్ని దానంచేశారు. నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి వైద్యసిబ్బంది దాతలరక్తాన్ని సేకరించారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్, పాలెపు చిన్నగంగారాం, కార్యదర్శి శాంతి కుమార్, వివేకానంద యూత్ సభ్యులు రాజశేఖర్, యాదగిరి, ప్రభాకర్, పసుపుల వినీత్, నల్ల గణేష్ గుప్త, రామస్వామి, సున్నం మోహన్, సల్లూరి కిషన్ గౌడ్, నవాతె రంజీత్ ,చింత ప్రదీప్, చంద్రమోహన్, దాత్రిక రాజ్ కుమార్, గ్రామ యువకులు పాల్గొన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో రక్తదాతలను మెమోంటోలను ఉప సర్పంచ్ గంగారాం, కార్యదర్శి శాంతికుమార్ అందజేశారు.

ఉత్సవ విగ్రహాల ఊరేగింపు

డిచ్‌పల్లి, జనవరి12: మండలంలోని ధర్మారం(బి)లో శ్రీదేవిభూదేవి సహిత వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీ సీతారామ లక్ష్మణ హనుమాన్ ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. భక్తి పాటలు పాడుతూ కాలనీల్లో ఊరేగింపు నిర్వహించారు.

కేరళ లాటరీ పేరిట మోసం

● బీర్కూర్ పీఎస్‌లో బాధితుడు ఫిర్యాదు



బీర్కూర్, జనవరి 12: నిరుపేదలనే లక్ష్యంగా చేసుకుని కొందరు స్వార్థపరులు లాటరీల పేరుతో అమాయక ప్రజలకు మోసం చేస్తున్నారు. సోషల్‌మీడియా ప్లాట్ ఫామ్‌లలో కోట్లు గెలుచుకోవచ్చనే లాటరీల అడ్వర్టజ్‌మెంట్‌లను చూసి ప్రజలు ఆకర్షితులై నిండా ము నుగుతున్నారు. అచ్చం ఇలాంటి సంఘటనే బీర్కూర్ మండలం కి ష్టాపూర్ గ్రామంలో శుక్రవారం వెలుగుచూసింది. కిష్టాపూర్ గ్రామా నికి చెందిన మక్క గంగారాం అనే వ్యవసాయ కూలి సుమారు రూ.11వేల వరకు పోగొట్టుకున్నాడు. తన స్మార్ట్ ఫోన్‌లో ఫేస్‌బుక్‌లో కేరళ లాటరీ అడ్వర్టైజ్‌మెంట్ చూశాడు. అందులో ఉన్న ఫోన్ నెంబ ర్‌కు కాల్ చేశాడు. వెంటనే అవతలి వ్యక్తి తన మాయమాటలతో గంగారాం అకౌంట్‌లోని డబ్బులను కాజేశాడు. కిష్టాపూర్‌కు చెందిన మెక్క గంగారాం గ్రామంలో కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఇదిలా ఉండగా ఈనెల 10వ తేదీన గంగారాం తన వద్ద ఉన్న స్మార్ట్ ఫోన్‌లో ఫేస్ బుక్ ఓపెన్ చేశాడు. కేరళ లాటరీ పోస్టును చూసి అందులో గల ఫోన్ నెంబర్‌కు కాల్ చేశాడు. మోసగాడు మాయమాటలు చెప్పి గంగారాంకు నమ్మకం కలిగించగా మోసగాడి సూచన మేరకు రూ. 149 గూగుల్‌పే పంపించాడు. తర్వాత అవతలి వ్యక్తి కొన్నిలాటరీ నెంబర్లను పంపగా గంగారాం అందులో నుంచి ఒక నెంబర్‌ను సెలెక్ట్ చేసి పంపించాడు. అనంతరం మోసగాడు గంగారంకు ఫోన్‌చేసి 7లక్షల లాటరీ తలిగిందని చెప్పాడు. మాయమాటలకు గంగారాం ఉప్పొంగి అవతలి వ్యక్తి మాయమాటలకు మధ్యాహ్నం రూ.3,100, సాయ ంత్రం రూ.7,200 పంపించాడు. రాత్రి ఫోన్ చేసి జీఎస్టీ, ఇన్‌కామ్‌టాక్స్, కరెంట్‌అకౌంట్ కోసం మరో రూ.12,500 పంపమన్నాడు. దీం తో గంగారాంకు అనుమానం వచ్చి డబ్బులు పంపలేదు. తనను ఎవరో మోసం చేశారని గ్రహించి శుక్రవారం బీర్కూర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పోలీసులు ఆన్‌లైన్‌లో మోసాలు, స్కీంలు, లాటరీలు తదితర మోసాలపై అప్రమత్తంగా ఉండాలని పోలీసులు గంగారాంకు అవగాహన కల్పించి ఇంటికి పంపించారు.

హత్య కేసును ఛేదించిన పోలీసులు

● వివాహేతర సంబంధమే హత్యకు దారి తీసింది
● కేసు వివరాలు వెల్లడించిన పోలీసులు

ఇందల్వాయి, జనవరి12: ఇందల్వాయి పోలీస్‌స్టేషన్ పరిధిలోని తిర్మన్‌పల్లి గ్రామశివారులో రైల్వేట్రాక్ పక్కన ఇటీవల జరిగిన హత్య కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడి భార్యతో అక్రమ సంబంధమే హత్యకు దారి తీసిందని విచారణలో తేలింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఇందల్వాయి మండలంలోని వెంగల్‌పాడ్ తండాకు చెందిన నరేష్ గత నెల 30 నుంచి కన్పించడం లేదని మృతుడి తల్లి నీలాబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇందల్వాయి పోలీస్‌స్టేషన్‌లో మిస్సింగ్ కేసు నమోదు చేశారు. కేసు విచారణలో ఉండగా.. జనవని 8న తిర్మన్‌పల్లి శివారులోని ఎల్లమ్మ ఆలయం వెనకాల రైల్వేట్రాక్ సమీపంలో నరేష్ మృతదేహం లభ్యమైంది. డిచ్‌పల్లి సీఐ కృష్ణ ఘటనాస్థలానికి వెళ్లి చుట్టుపక్కల వారిని విచారించగా కొత్త కొరుట్ల తండాకు చెందిన కేతావత్ రాజేష్, మృతుడు నరేష్ డిసెంబర్ 30న తిర్మన్‌పల్లి గ్రామంలోని కల్లుబట్టి వద్ద కల్లుతాగి వెళ్లారని తెలిసింది. రాజేష్ గురించి వెతుకుతుండగా అతను అప్పటినుంచి కనిపించకుండా పోయాడని ఈనెల 11న రాజేష్‌ను పట్టుకొని విచారించగా మృతుడు నరేష్‌కు, నింధితుడు రాజేష్ భార్యతో అక్రమ సంబంధం ఉండటంతో రాజేష్ నరేష్‌ను కల్లుబట్టి వద్దకు తీసుకువెళ్లి కల్లుతాగించి తనను చంపుతానని బెదిరించడంతో అక్కడి నుండి పారిపోయినట్లు తెలిపారు. పారిపోతున్న నరేష్‌ను వెంబడించి రైల్వేట్రాక్ వద్ద పట్టుకొని గొంతుపై కాలువేసి పెద్దబండ రాయితో తలపై బాదడంతో నరేష్ అక్కడికక్కడే మృతిచెందాడని నింధితుడు రాజేష్ ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. భార్యతో ఉన్న వివాహేతర సంబంధం వల్లే నరేష్‌ను చంపానని, తన భార్య తనకు దూరమవుతుందన్న ఆవేదనతో నేరం చేశానని తెలిపినట్లు సీఐ వెల్లడించారు. నింధితుడి వద్ద నుంచి సెల్‌ఫోన్, హత్యకు ఉపయోగించిన బండరాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. నిజామాబాద్ సీపీ కల్మేశ్వర్ ఆదేశాల మేరకు ఏసీపీ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో కేసును ఛేదించామని, ఇందులో డిచ్‌పల్లి సీఐ కృష్ణ, ఇందల్వాయి ఎస్సై మహేష్, సిబ్బంది రాజేశ్వర్, ప్రసాద్, సర్దార్, సతీష్, కిశోర్, రాము ఉన్నారు.

● నింధితుడి రిమాండ్

డిచ్‌పల్లి: తన భార్యతో వివాహేతర సంబంధం పెట్టుకున్నాడని వెంగల్‌పాడ్ గ్రామానికి చెందిన నరేశ్‌ను హత్యచేసిన రాజేశ్‌ను శుక్రవారం రిమాండ్ చేసినట్లు డిచ్‌పల్లి సీఐ కృష్ణ, ఎస్సై మహేశ్‌లు తెలిపారు. నేరం ఒప్పుకోవడంతో నిందితుడిని కోర్టులో ప్రవేశపెట్టినట్లు తెలిపారు.

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

ముప్కాల్, జనవరి12: బాల్కొండ జాతీయరహదారిపై గురువారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని కల సంతోష్ (48) అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఏర్గట్ల మండలం తడ్‌పాకల్ గంగనది ఒడ్డునఉన్న ఆలయంలో సంతోష్ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. బాల్కొండ మండలం కిసాన్‌నగర్‌లో తండ్రి గంగారాం అనారోగ్యంతో ఉన్నాడని తెలిసి చూసి తిరిగి కాలినడకన వెళ్తుండగా జాతీయ రహదారిని దాటే సమయంలో వేగంగా వచ్చిన ఢీకొట్టగా కల సంతోష్ అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి ఇద్దరు కూతుళ్లు ఉన్నారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాల్కొండ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎఎస్సై శంకర్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకుల మృతి



మృతులు సమీర్, అనాస్ (ఫైల్)

ఎడపల్లి/ఖిల్లా, జనవరి12: మండలంలోని జానకంపేట గ్రామశివారులోగల అశోక్‌సాగర్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఇద్దరు యువకు లు మృతిచెందారు. మరో యువకుడికి తీవ్ర గాయాలు కాగా స్థానికులు 108లో నిజామాబాద్ జిల్లా ఏరియా ఆస్పత్రికి తరలించారు. మండలంలోని నెహ్రూనగర్ గ్రామానికి చెందిన సమీర్, అనాస్, కరీం అనే యువకులు బైకుపై నెహ్రూనగర్ నుంచి బోధన్ వైపు వెళ్తుండగా బోధన్ నుంచి నిజామాబాద్ వెళ్తున్న ఎర్టీగా కారు బైకుని ఢీకొట్టడంతో అక్కడికక్కడే సమీర్ (28), అనాస్ (30) మృతిచెందగా.. కరీం తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు కరీంను నిజామాబాద్ ఏరియాస్పత్రికి తరలించారు. నిజామాబాద్ 6వ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సహకార నిబంధనలను ఉల్లంఘించిన పాలకవర్గం?

● పోతంగల్ విండో కార్యదర్శితో సహా పాలకవర్గాన్ని రద్దు చేయాలని ఏకగ్రీవ తీర్మానం ● సంఘం లావాదేవీలపై విచారణ జరపాలని సభ్యుల డిమాండ్

కోటగిరి, జనవరి 12: సహకార సంఘం నిబంధనల మేరకు నడుచుకోవాల్సిన పాలకవర్గం వివిధకారణాలతో జనరల్ బాడీ సమావేశాన్ని సకాలంలో నిర్వహించకపోవడంపై సభ్యుల నుంచి తీవ్ర నిరసన వ్యక్తమైంది. సహకార సంఘం కార్యదర్శి పాలకవర్గం సంఘం నిర్వహణలో పట్టు కోల్పోయారంటూ సభ్యులు ఆరోపించారు. ఇలాంటి పాలకవర్గం ఒక్క క్షణం పదవిలో ఉండరాదంటూ కార్యదర్శితో పాలకవర్గాన్ని రద్దు చేయాలని తీర్మానం చేయడం విశేషం. పోతంగల్ మండలం కేంద్రంలో విశాల సహకార పరపతి సంఘం 86వ మహాజన సభ డీసీసీబీ డైరెక్టర్, విండో అధ్యక్షుడు శాంతేశ్వర్‌పటేల్ అధ్యక్షతన శుక్రవారంఏర్పాటుచేశారు. మహాజన సభలో సంఘం వార్షిక లావాదేవీలను విండో కార్యదర్శి భారత్ వివరిస్తుండగా సభ్యులు అడ్డుకున్నారు. గత ఏడాది సెప్టెంబరు 30వ తేదీన నిర్వహించాల్సిన మహాజన సభ ఎందుకు నిర్వహించలేదని సభ్యులు ప్రశ్నించారు. ఏడాది క్రితం సంఘంలో జరిగిన లావాదేవీలపై సమగ్ర వివరాలు వెల్లడించని పాలకవర్గం సకాలంలో మహాసభ సైతం నిర్వహించకుండా జాప్యం చేయడం సభ్యుల ఆగ్రహానికి కారణమైంది. ఈ విషయమై పాలకవర్గం, విండో కార్యదర్శిని ప్రశ్నించగా సరైన సమాధానం రాకపోవడంతో సభ్యులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. విండో కార్యదర్శి, అధ్యక్షుడు సంఘం లావాదేవీలపై సమగ్ర వివరాలు సభ్యులకు ఎందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. విండో అధ్యక్షులు శాంతేశ్వర్ పటేల్ మాట్లాడుతూ తాను అనారోగ్య సమస్యలతో బాధపడి సమావేశ నిర్వహణలో జాప్యం జరిగిందని వివరించారు. విండో కార్యదర్శి సహకరించకపోవడంతో ఈ విషయమై డీసీవో దృష్టికి తీసుకెళ్లినట్లు ఆయన వివరించారు. సమస్యను జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినవారు పట్టించుకోకపోవడంపై సభ్యులు పలు అనుమానాలు వ్యక్తం చేశారు. సంఘం ఆధ్వర్యంలో నిర్వహించే పలు వ్యాపార లావాదేవీల్లోనూ అక్రమాలు జరిగినట్లు సభ్యులు ఆరోపించారు. విండో కార్యదర్శి నిర్లక్ష్యం వల్లే ఇన్‌కమ్ టాక్స్ సేల్ టాక్స్ సుమారు 3కోట్ల రూపాయల వరకు జరిమాన కట్టాల్సి వచ్చిందన్నారు. నిజామాబాద్‌లో రైస్‌షాప్ నిర్వహించే విషయంలో సమగ్ర వివరాలు ఎందుకు లేవని సభ్యులు షాదుల రమేష్ ప్రశ్నించారు. 2019లో 10నెలల నివేదిక పరిశీలించగా 52లక్షల బియ్యం సేల్స్ చేసి 43లక్షలు మాత్రమే ఖాతాలో జమ చేశారన్నారు. మిగతా 9లక్షలకు ఎలాంటి ఆధారాలు లేవన్నారు. రైస్‌మిల్లు తౌడు విక్రయాల్లో అక్రమాలు చోటు చేసుకున్నాయని సభ్యులు ఆరోపించారు. రాష్ట్రంలోనే పేరుగాంచిన సహకార సంఘంలో రైతులకు ఎరువులు అందించలేని పరిస్థితితలెత్తిందన్నారు. తాము ఇతర ప్రాంతాలకు వెళ్లి ఫర్టిలైజర్ కొనుగోలు చేయాల్సిన పరిస్థితి తలెత్తిందన్నారు. మరోవైపు విండో ఉపాధ్యక్షుడు పవన్ రాజీనామా చేసి 4నెలలు గడుస్తున్నా ఆమోదించినట్టా, ఆమోదించనట్టా పాలకవర్గానికే తెలియకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ఏకగ్రీవంగా పాలకవర్గాన్ని నియమిస్తే సంఘం పాలన పూర్తిగా గాడి తప్పి నష్టాల ఊబిలోకి జారుకుందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏకపక్షంగా నిర్ణయాలు తీసుకుంటూ సంఘానికి నష్టం చేస్తే సహించేది లేదని సభ్యులు పేర్కొన్నారు. సహకార సంఘ నిబంధనల మేరకు జనరల్ బాడీ సమావేశాన్ని నిర్వహించకపోతే రద్దు చేసే అధికారం మహాసభ సభకు ఉందని సభ్యులు పేర్కొన్నారు. తక్షణమే పాలకవర్గాన్ని రద్దు చేస్తూ విండో కార్యదర్శిని తొలగించాలని మెజారిటీ సభ్యులు ఏకగ్రీవంగా తీర్మానించారు. సంఘంలో గత నాలుగేళ్లలో జరిగిన లావాదేవీలపై సమగ్ర విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని సభ్యులు తీర్మానించారు. కార్యక్రమంలో విండో కార్యదర్శి భరత్, మాజీ జడ్పీటీసీ శంకర్, మాజీ ఎంపీపీ పవన్, మాజీ సర్పంచ్ దిలీప్ కుమార్, విండో డైరెక్టర్లు పాల్గొన్నారు.



సమస్యలపై విండో అధ్యక్షుడిని ప్రశ్నిస్తున్న సభ్యులు

సీఎంను కలిసిన చంద్రశేఖర్‌రెడ్డి


సీఎంను కలిసిన కాంగ్రెస్ నాయకుడు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి టౌన్, జనవరి 12: తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కాంగ్రెస్ నేత గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి హైదరాబాద్‌లోని తన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి షబ్బీర్‌అలీతో కలిసి గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి సంక్రాంతి పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపడుతున్న 6 గ్యారెంటి పథకాల గురించి, కామారెడ్డి నియోజకవర్గం స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.

దెగ్లూర్‌కు బస్సు ట్రిప్పులు పెంచండి

మద్నూర్, జనవరి 12: బాన్సువాడ నుంచి దెగ్లూర్ వరకు బస్సు ట్రిప్పులు తక్కువగా ఉండటంతో గంటల తరబడి ప్రయాణికులు వేచి ఉంటున్నారని, అధికారులు స్పందించి బస్సు ట్రిప్పులు పెంచాలని ప్రయాణికులు కోరుతున్నారు. బస్సులు లేక ప్రైవేట్ వాహనాలను ఆశ్రయిస్తున్నామని, దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దెగ్లూర్‌కు ట్రిప్పులు పెరిగితే ప్రభుత్వానికి ఆదాయం పెరగడంతో పాటు ప్రయాణికుల ఇబ్బందులు తప్పుతాయన్నారు. ఈ విషయమై బాన్సువాడ డిపో మేనేజర్ సరితను వివరణ కోరగా.. ఈ పాటికే పలు బస్సులు నడుస్తున్నాయని, అదనంగా రాత్రి పూట కూడా బస్సులు నడుస్తున్నాయని, ప్రజల సూచనల మేరకు జిల్లా అధికారులతో మాట్లాడి ట్రిప్పులు పెంచేలా చర్యలు తీసుకుంటామన్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా ఆయా ట్రిప్పులు పెంచామని గుర్తు చేశారు.

నేటి నుంచి సీసీఐ కొనుగోలు కేంద్రానికి సెలవులు

మద్నూర్, జనవరి 12: మండల కేంద్రంలోని సీసీఐ కొనుగోలు కేంద్రానికి ప్రభుత్వం సెలవులు ప్రకటించిందని మార్కెట్‌కు రైతులు పత్తిని తీసుకుని రావద్దని కార్యదర్శి విఠల్ తెలిపారు. ఈ నెల 13 నుంచి 17 వరకు సంక్రాంతి సెలవుల సందర్భంగా పత్తి కొనుగోళ్లను ప్రభుత్వ ఆదేశాల మేరకు నిలిపివేసినట్లు ఆయన వెల్లడించారు. రైతులు పత్తిని తీసుకుని వచ్చి ఇబ్బందులు పడవద్దని తెలిపారు. ఈ నెల 18 నుంచి సీసీఐ కొనుగోళ్లు యదావిధిగా ప్రారంభం అవుతాయని తెలిపారు.


తాడ్కోల్‌లో రేషన్ దుకాణాన్ని తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

85 క్వింటాళ్ల బియ్యం మాయం చేసిన రేషన్ డీలర్

- విజిలెన్స్ అధికారుల తనిఖీలో బయటపడ్డ వైనం

బాన్సువాడ, జనవరి 12: మండలంలోని తాడ్కోల్ గ్రామంలోని రేషన్ దుకాణంలో విజిలెన్స్ ఎన్‌ఫోర్సుమెంట్ అధికారి సత్యనారాయణ శుక్రవారం దాడులు నిర్వహించారు. గంగాధర్ పేదలకు పంపిణీ చేయాల్సిన బియ్యాన్ని అక్రమంగా తరలించినట్లు అధికారుల తనిఖీల్లో వెలుగు చూసింది. రేషన్ షాపులో 85 క్వింటాళ్ల బియ్యం తక్కువ రావడంతో డీలర్‌పై కేసు నమోదు చేశారు. నివేదికను కలెక్టర్‌కు అందజేస్తామని అధికారులు తెలిపారు.

తూకంలో అవకతవకలకు

పాల్పడితే కఠిన చర్యలు తప్పవు

- జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్‌బాబు


అధికారుల తనిఖీల్లో గోనె సంచితో తూకం వేస్తున్నట్లు గుర్తించిన దృశ్యం

కామారెడ్డి టౌన్, జనవరి 12: తూకంలో అవకతవకలకు పాల్పడిన, సమయ వేళలు సరిగ్గా పాటించకపోయిన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా పౌర సరఫరాల అధికారి మల్లికార్జున్‌బాబు చౌకధరల దుకాణ డీలర్లను హెచ్చరించారు. శుక్రవారం కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం కామారెడ్డి పట్టణంలోని పలు చౌకధరల దుకాణాలను తమ బృందంతో కలిసి తనిఖీ చేశారు. కొన్నిచోట్ల తూకం సరిగ్గా వేస్తుండగా మరికొన్నిచోట్ల గోనె సంచులతో తూకం వేస్తున్నారని, తద్వారా లబ్ధిదారుడు ఆ సంచి బరువు 600 గ్రాముల బియ్యం కోల్పోతున్నారని గుర్తించినట్లు తెలిపారు. ఎలక్ట్రానిక్ మిషన్‌పై గోనె సంచితో తూకం చేస్తున్న చౌకధర దుకాణాన్ని, సమయవేళలు పాటించని మరో దుకాణాన్ని గుర్తించి శాఖాపరంగా కేసు నమోదు చేసి తగు చర్యలకై ఆర్డీవోకు పెనాల్టీ విధించుటకు నివేదిక పంపామని తెలిపారు. చౌకధరల దుకాణాలను ఉదయం 8 గంటల నుంచి 12 గంటల వరకు తిరిగి సాయంత్రం 4 గంటల నుంచి 8 గంటల వరకు తెరిచి ఉంచాలని, తూకంలో ఎలాంటి తేడా రాకుండా చూడాలని కోరారు. జిల్లాలోని చౌకధరల దుకాణాలను తరచూ తనిఖీ చేస్తుంటామన్నారు. ఎవరైన నిబంధనలు ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్‌వో హెచ్చరించారు. ఈ తనిఖీల్లో సహాయ పౌరసరాఫరాల అధికారి నిత్యానందం, ఉప తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా స్వామి వివేకానంద జయంతి

కామారెడ్డి టౌన్, జనవరి 12: జాతీయ యువజన దినోత్సవం పురస్కరించుకొని వివేకానంద జయంతిని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కామారెడ్డి జిల్లా కేంద్రంలో హిందూ వాహిని ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించి మున్సిపల్ కార్యాలయం వద్ద గల వివేకానందుడి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఏబీవీపీతో పాటు వివిధ సంఘాల ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయం వద్ద గల వివేకానంద విగ్రహానికి, చిత్రపటానికి పూలమాలవేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విశ్వవేదికపై భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను చాటిన స్ఫూర్తి ప్రధాత స్వామి వివేకానందుడని, యువతకు స్ఫూర్తిగా నిలవడమే కాకుండా భారతదేశ ఖ్యాతిని నలుదిశలా వ్యాపింపజేసిన మహానుభావుడని ఆయన చేసిన సేవలకు గాను జనవరి 12న జాతీయ యువజన దినోత్సవంగా జరుపుకుంటున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో హిందూవాహిని నాయకుడు లక్ష్మణ్‌జీ, జిల్లా అధ్యక్షుడు సాయికిరణ్, విశ్వహిందూ పరిషత్ జిల్లా అధ్యక్షుడు గోపాలకృష్ణ, నగర అధ్యక్షుడు తరుణ్‌గౌడ్, సాయితేజ తదితరులు పాల్గొన్నారు.

దోమకొండలో..

దోమకొండ: మండల కేంద్రంలో శుక్రవారం వివిధ పార్టీల నాయకులు, ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతి వేడుకలను వేర్వేరుగా నిర్వహించారు. స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో చింతల రాజేష్, కళాశాల ప్రిన్సిపాల్ జైపాల్‌రెడ్డి, లెక్చరర్ శేషారావు తదితరులు పాల్గొన్నారు. మండల కేంద్రంలోని మార్కండేయ మందిరంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రి, ఎయిడ్స్ నియంత్రణ మండలి దోమకొండ రక్తదాతల సమూహం సంయుక్త ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. 20 మంది రక్తదానం చేశారు.

పెద్ద కొడప్‌గల్‌లో..

పెద్ద కొడప్‌గల్: జుక్కల్ మండల కేంద్రంతో పాటు, మండలంలోని ఆయా గ్రామాల్లో స్వామి వివేకానంద 161వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని పెద్దఎడ్గి గ్రామంలో వివేకానందుని చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మండల యువ నాయకులు మాట్లాడుతూ వివేకానందుని అడుగుజాడల్లో నేటి యువత నడవాలని సూచించారు, ఈ కార్యక్రమంలో ఏడ్గి సర్పంచ్ వినోద్, ఎంపీటీసీ సునీత విజయ్ తదితరులు పాల్గొన్నారు.

నసురుల్లాబాద్‌లో..

నసురుల్లాబాద్: మండలంలోని సంగం తండాలో సేవా సంఘ్ ఫ్రెండ్స్ యూత్ వారి ఆధ్వర్యంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ విఠల్ స్వామి, గ్రామ పెద్దలు శ్రీచంద్, శివరాం, మోహన్, లాల్‌సింగ్, బిబియా నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీర్కూర్‌లో..

బీర్కూర్: మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించారు. ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ చంద్రశేఖర్ స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. స్వామి వివేకానందను నేటి యువత ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్యామ్‌సుందర్, దేవీసింగ్ తదితరులు పాల్గొన్నారు.

నిజాంసాగర్‌లో..

నిజాంసాగర్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల అచ్చంపేటలో జాతీయ యువజన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వివేకానంద చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేకానందుని సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాస్, జీవన్ గౌడ్, శివాజీ, శంకర్, సువర్ణ, రాజు, తదితరులు పాల్గొన్నారు.

సదాశివనగర్‌లో..

సదాశివనగర్: స్వామి వివేకానంద జయంతి వేడుకలను శుక్రవారం మండల కేంద్రంలో యూత్ క్లబ్ సామాజిక సామరస్యత వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ప్రపంచానికి భారతదేశం ఆధ్యాత్మిక విలువలను చాటి చెప్పిన మహనీయుడు స్వామి వివేకానంద అని ఆయన సేవలను వక్తలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో నేస్తం యూత్ క్లబ్ అధ్యక్షుడు ఆస రాజేశ్వర్, నరేష్, బంటు శేఖర్, ఆస సురేష్, బాలరాజ్, గోపాల్, యోగేష్‌రెడ్డి, సంతోష్, సంపత్, విఠల్‌రావు పాల్గొన్నారు.

బాన్సువాడలో..

బాన్సువాడ టౌన్: బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో వివేకానందుడి జయంతిని బాన్సువాడ ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఘనంగా నిర్వహించారు. రామకృష్ణ పరమహంస శిష్యుడిగా ఉండి వేదాంత తత్వం ఎంచుకున్న గొప్ప మహనీయుడని తెలిపారు. ఆయన రచనలకు, సూక్తులకు మహాత్మాగాంధీ, సుభాష్ చంద్రబోస్, గోపాల చక్రవర్తి లాంటి గొప్పగొప్ప నాయకులు కూడా ప్రభావితులయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు రాఘవ, సాయి, సంజీవ్, నాని, సంతోష్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.


కామారెడ్డి మున్సిపల్ కార్యాలయం వద్ద వివేకానంద విగ్రహం వద్ద నివాళ్లు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

ఎల్లారెడ్డిలో..

ఎల్లారెడ్డి : మండలంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో స్వామి వివేకానంద జయంతిని ఘనంగా నిర్వహించినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చెన్న లక్ష్మణ్ స్వామి చిత్రపటానికి పూలమాలలు వేశారు. అనంతరం జ్యోతి ప్రజల్వన చేశారు. అనంతరం కాంగ్రెస్ సీనియర్ నాయకులు చెన్న లక్ష్మణ్, మాజీ జడ్పీటీసీ గయాజుద్దిన్ మాట్లాడుతూ నేటి యువత స్వామి వివేకానందుడిని ఆదర్శంగా తీసుకుని ఎదగాలని సూచించారు.

లింగంపేటలో..

లింగంపేట: స్వామి వివేకానంద ప్రపంచ యువతకు ప్రేరణగా నిలిచారని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నరెందర్ అన్నారు. ఆయన శుక్రవారం లింగంపేట మండలంలోని సూరాయిపల్లిలో స్వామి వివేకానంద జయంతిని యువశక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో రాజ్‌కుమార్, యువశక్తి ఫౌండేషన్ అధ్యక్షుడు కృష్ణ, శ్రీనివాస్, వంశీ, ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్లు ధర్‌సింగ్, రాజయ్యలతో పాటు వాలంటీర్లు ఉన్నారు.

భిక్కనూరులో..

భిక్కనూరు: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో స్వామి వివేకానందా జయంతి కార్యక్రమాన్ని శుక్రవారం ఆయా గ్రామ పంచాయతీ, యువజన, విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు భిక్కనూరు పట్టణంతో పాటుగా మండలంలోని ఆయా గ్రామాల్లో వివేకానందా విగ్రహాలకు, చిత్రపటాలకు ప్రజాప్రతినిధులు, నాయకులు, యువజన సంఘాల ప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రజాప్రతినిధులు, నాయకులు మాట్లాడుతూ నేటి యువత వివేకానందను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, నాయకులు, యువజన, విద్యార్థి సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


సూరాయిపల్లిలో..


పెద్ద ఎడ్గిలో..


బాన్సువాడలో..

సీతారామ ప్రతిమలకు ప్రత్యేక పూజలు

భిక్కనూరు, జనవరి 12: మండలంలోని జంగంపల్లి గ్రామంలో రంగనాయకుని గుట్టపై పెద్దరాయిపై చెక్కబడిన శ్రీ సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి ప్రతిమలకు గ్రామస్థులు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థులు మాట్లాడుతూ గ్రామంలో రంగనాయకుని గుట్టపై చాలా సంవత్సరాలుగా పెద్దరాయిపై చెక్కబడిన శ్రీ సీతారాముల, లక్ష్మణ, అంజనేయస్వామి విగ్రహాలకు దూపదీపాలు, పూజలు చేయకపోవడంతో ఆలయం శిథిలావస్థకు చేరుకుందన్నారు. ఈ మేరకు ఆలయ పరిసరాలను శుభ్రం చేసి స్వామివారికి ప్రత్యేక పూజలు చేయడం జరిగిందన్నారు. ప్రభుత్వం స్పందించి ఈ ఆలయాన్ని అభివృద్ధి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు పెద్దఎత్తున పాల్గొన్నారు.


జంగంపల్లిలో శ్రీ సీతారాముల విగ్రహాలు పూజలు చేస్తున్న దృశ్యం

రామాలయంలో కుంకుమ పూజలు

సదాశివనగర్: మండలంలోని కుప్రియల్ గ్రామంలో గల రామాలయం వద్ద శుక్రవారం కుంకుమ పూజలు నిర్వహించారు. తిరుమలతిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో హిందూధర్మ ప్రచార కమిటీ స్వామివారికి కుంకుమ పూజలు నిర్వహించారు. మహిళలు ఈ కార్యక్రమంలో పెద్దఎత్తున పాల్గొని స్వామివారికి పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ ప్రతినిధులు మహిళలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో ధనుర్మాస ఉత్సవాలు


శ్రీవారికి 108 రకాల ప్రసాదాలను నివేదించిన దృశ్యం

బీర్కూర్, జనవరి 12: మండలంలోని తిమ్మాపూర్ గ్రామ సమీపంలో గల తెలంగాణ తిరుమల దేవస్థానం మహా పుణ్యక్షేత్రంగా వెలుగొందుతుంది. ఇదిలా ఉండగా దేవస్థానంలో గత నెల రోజుల నుంచి ధనుర్మాస ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. ఇందులో భాగంగా శుక్రవారం ఆలయ సన్నిధిలో ధనుర్మాస ఉత్సవాలు కన్నుల పండుగ నిర్వహించారు. వేద పండితుడు నందు, అభిలాష్ ఆధ్వర్యంలో ధనుర్మాస ఉత్సవాలతో పాటు శ్రీవారికి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం ఆలయ మాడ వీధుల్లో శ్రీవారికి పల్లకి సేవ చేశారు. శ్రీవారి నామస్మరణ మధ్య మహిళల కోలాటాలు, యువకుల నృత్యాలు భక్తులను ఆకట్టుకున్నాయి. పల్లకిలో ఆసినులై స్వామి వారు భక్తులకు దర్శనమిచ్చారు. ధనుర్మాసం సందర్భంగా శ్రీవారి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు. కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

రేపు రేణుక ఎల్లమ్మ జాతర

మాచారెడ్డి, జనవరి 12: మండలంలోని భవానిపేట గ్రామంలో ఈనెల 14న శ్రీరేణుక ఎల్లమ్మ జాతర నిర్వహిస్తున్నట్లు గ్రామ ఉప సర్పంచ్ రమేష్ గౌడ్ తెలిపారు. గ్రామంలోని ఇంటికో బోనం తీసి గ్రామంలోని ప్రధాన వీధుల గుండా ఊరేగించి అమ్మవారికి సమర్పించే కార్యక్రమం ఉంటుందని ఈనెల 15 ఆలయం చుట్టూ ఎడ్లబండ్ల ప్రదర్శన ఉంటుందని తెలిపారు. భక్తులందరూ జాతరలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకోవాలని కోరారు.

నాటుసారా పట్టివేత

రామారెడ్డి, జనవరి 12: జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ అధికారి రవీందర్‌రాజు ఆదేశాల మేరకు కామారెడ్డి ఎస్‌హెచ్‌ఓటీం, డీటీఎఫ్ టీమ్స్ గురువారం రాత్రి మండలంలోని స్కూల్ తండాలో దాడులు నిర్వహించి 15 లీటర్ల నాటు సారా, 40 లీటర్ల విప్పపువ్వు పానకంను స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ విజయ్ కుమార్ తెలిపారు. నాటుసారా, ఇప్పపువ్వును నిల్వ ఉంచిన గుగులోత్ పద్మ, భూక్య సునిత, బట్టు పెరిగాన్‌లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

కార్యవర్గం ఎన్నిక

సదాశివనగర్, జనవరి 12: ఛత్రపతి టీచర్స్ సొసైటీ కార్యవర్గాన్ని శుక్రవారం కామారెడ్డి శ్రీకృష్ణమందిర్‌లో ఏకగ్రీవంగా ఎనుకున్నట్లు ప్రతినిధులు రాజశేఖర్, కృష్ణారావు తెలిపారు. అధ్యక్షుడిగా హన్మంతోల్ల బాలకిషన్, ప్రధాన కార్యదర్శిగా గడ్డమీది రాజశేఖర్, కోశాధికారిగా దంతపల్లి రమేష్‌ను ఎన్నుకున్నామన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు మాట్లాడుతూ.. సొసైటీ అభివృద్ధి కోసం తమ వంతు కృషి చేస్తామని అన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్‌ఎస్ కౌన్సిలర్

కామారెడ్డి టౌన్, జనవరి 12: కామారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 13వ వార్డు కౌన్సిలర్ శంకర్‌రావు బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి మాజీ మంత్రి షబ్బీర్‌అలీ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. టెక్రియాల్ వార్డు అభివృద్ధి కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని భావించి కాంగ్రెస్‌లో చేరినట్లు ఆయన తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆరు గ్యారెంటీ పథకాలు అమలుతో పాటు అభివృద్ధి పథంలోకి వెళ్తున్నందున బీఆర్‌ఎస్ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డి, ఊరుదొండ రవి, కౌన్సిలర్ రవీందర్‌గౌడ్, గోనె శ్రీనివాస్, పంపరి లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

చైర్మన్ వైస్ చైర్మన్లపై అవిశ్వాసానికి రంగం సిద్ధం

లింగంపేట, జనవరి 13: మండలంలోని శెట్పల్లిసంగారెడ్డి సొసైటీ చైర్మన్ లింగారెడ్డిగారి సుకన్య, వైస్‌చైర్మన్ బండారు కిష్టారెడ్డిలపై 10 మంది డైరెక్టర్లు అవిశ్వాసం ప్రకటించారు. డీసీవో, జిల్లా ఇన్‌చార్జి డీసీవోకు అవిశ్వాస తీర్మాన కాపీని అందజేశారు. మొత్తం 13మంది డైరెక్టర్లకు గాను 10మంది అవిశ్వాసానికి అనుకూలంగా తీర్మానం చేశారు.

పాఠశాలల్లో సంక్రాంతి వేడుకలు

పెద్ద కొడప్‌గల్, జనవరి 12: మండల కేంద్రంలో గల బాలికల గురుకుల పాఠశాలలో శుక్రవారం పాఠశాల సిబ్బంది సంక్రాంతి వేడుకలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో భోగి మంటలు వేయడంతో పాటు గొబ్బెమ్మలు వేసి ఆటపాటలతో సందడి చేశారు. ప్రత్యేకంగా పిండి వంటలు తయారు చేసి అందరూ కలిసి ఒక దగ్గర చేరి పిండి వంటలను ఆరగించారు. ఈ సందర్భంగా గురుకుల సిబ్బంది చిన్నారులపై రేగు పండ్లు వేసి ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల పిన్సిపాల్ నళిని, సీనియర్ అసిస్టెంట్ సతీష్ చంద్ర, సిబ్బంది భాగ్యలక్ష్మి, రంజిత నవనీత, పర్వీన్ తదితరులు పాల్గొన్నారు.

రాజంపేట: మండలంలోని శివాయిపల్లి గ్రామంలో శుక్రవారం ఎంపీపీఎస్ పాఠశాలలో ఘనంగా సంక్రాంతి సంబరాలు నిర్వహించినట్లు ప్రధానోపాధ్యాయులు ముదాం స్వామి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి పండుగ సందర్భంగా ముందుగా పాఠశాలలో విద్యార్థుల వ్యాసరచన, డ్రాయింగ్, పతంగుల తయారి ముగ్గుల పోటీలు నిర్వహించినట్లు హరిదాసుల వేషదారణలో విద్యార్థులు అలరించారని పోటీల గెలుపొందిన వారికి బహుమతులు అందజేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి ఎస్‌హెచ్‌వోగా చంద్రశేఖర్‌రెడ్డి

కామారెడ్డి టౌన్, జనవరి 12: కామారెడ్డి పట్టణ ఎస్‌హెచ్‌వోగా కే.చంద్రశేఖర్‌రెడ్డి నియామకం అయ్యారు. శుక్రవారం రాత్రి అందుకు సంబంధించిన నియామక పత్రాలు సైతం వెలువడినట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్‌బీ సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. గతంలో కామారెడ్డి రూరల్ సీఐగా విధులు నిర్వహించి ఆ తర్వాత రామాయంపేట సీఐగా బదిలీ అయ్యారు. కొద్ది రోజుల్లోనే ఎస్‌బీ సీఐగా మళ్లీ జిల్లాకు వచ్చారు. ప్రస్తుతం గత కొద్ది రోజులుగా ఎస్‌బీ సీఐగా విధులు నిర్వహిస్తున్నారు. వివాదారహితుడిగా చంద్రశేఖర్‌రెడ్డికి మంచి పేరుంది. అటు ప్రజలతో పాటు ఇటు అన్ని పార్టీల నాయకులతో కలివిడిగా ఉంటూ కామారెడ్డి రూరల్ సీఐగా పని చేసిన సమయంలో మంచి గుర్తింపును సంపాదించారు.

'పంచాయతీ అక్రమాలపై విచారణ జరిపించాలి'


మండల సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం ఇస్తున్న కాంగ్రెస్ నాయకులు

పెద్ద కొడప్‌గల్, జనవరి 12: పెద్ద కొడప్‌గల్ గ్రామ పంచాయతీలో చోటు చేసుకున్న అక్రమాలపై అధికారులు విచారణ చేయాలని మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం మండల సీనియర్ అసిస్టెంట్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ ఇళ్ల నిర్మాణం కోసం పంచాయతీ సిబ్బంది గ్రామస్థుల నుంచి అక్రమంగా డబ్బులు వసూలు చేశారని ఆరోపించారు. ఇంటి నిర్మాణానికి గాను కొంత మంది దగ్గర రూ.14 వేలు తీసుకుని రూ.982 రశీదు ఇచ్చారని ఆరోపించారు. మిగతా డబ్బులకు రశీదు ఇవ్వలేదని తెలిపారు. అంతేకాకుండా పంచాయతీ షెట్టర్లలో విద్యుత్ మీటర్ల కనెక్షన్ కోసం సిబ్బంది అధిక డబ్బులు తీసుకున్నారని తెలిపారు. ఇక దీంతో పాటుగానే పంచాయతీ తరఫున పారిశుధ్య పనులు చేయకున్నా చేసినట్లుగా, వీధి దీపాలు పెట్టకున్నా పెట్టినట్లుగా బిల్లులు పెట్టి డబ్బులు తీసుకున్నారని ఆరోపణ చేశారు. ఈ విషయాలన్నింటిపై అధికారులు విచారణ చేసి అక్రమాలకు పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామ కాంగ్రెస్ నాయకులు విన్నవించారు, ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మహేందర్ రెడ్డి, చిప్ప మోహన్, సంజీవ్ తదితరులు పాల్గొన్నారు.

సినిమా గైడ్ కామారెడ్డి



కామారెడ్డి

ప్రియా 35	- సలార్
దర్శన్	- హనుమాన్
శాంతి	- గుంటూరు కారం
ప్రియా 70	- గుంటూరు కారం

బాన్సువాడ

మహేశ్వరి - గుంటూరు కారం

చికెన్ ధరలు



రకం		లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	:	100	160	180
పెన్‌కాట్(కిలో)	:	100	180	210

